క్లుప్తంగా

నేడు ఉచిత కంటి శిబిరం

సుండుపల్లె : మండల కేంద్రంలోని ఆరెమ్మ దేవాలయం వద్ద నేడు బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు యర్రపురెడ్డి ఆరెంరెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

రాయచోటి టౌన్ : చట్టాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని దిశ సీఐ శేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, ఉమెన్ సేఫ్టీ వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అలాంటివి చేస్తున్నట్లు సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని సీఐ కోరారు.

ఉలవలు కోసం రిజిస్ట్రేషన్ తప్పనిసరి

సుండుపల్లె : మండల పరిధిలోని సుండుపల్లె - 2 రైతు సేవా కేంద్రంలో ఉలవ పంట వేసే రైతులు విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఉద్యానశాఖ సహాయకుడు మల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం, గురువారాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. 80 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇస్తామన్నారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌ను తెలుసుకోవాలి

చిట్వేలి : స్థానిక సాయి వికాస్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నైతిక విలువలు, బేటీ బచావో.. బేటీ పడావోలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్య మాట్లాడుతూ విద్యార్థుల మధ్య నైతిక విలువలు, నేటి సమాజంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలను గురించి వివరించారు. ముఖ్యంగా ఆడపిల్లలు చెడు స్పర్శ, మంచి స్పర్శ గురించి తెలుసుకోవాలన్నారు.

బొప్పాయి రైతు వెన్నువిరుస్తున్న దళారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరులోని బొప్పాయి దళారులు, సేట్‌లు కుమ్మక్కై రైతుల వెన్ను విరుస్తున్నారని మంగళవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బొప్పాయి రైతులతో కలిసి ఆయన మాట్లాడుతూ కోడూరు ప్రాంతంలో బొప్పాయి వ్యాపారం వందల కోట్లలో ప్రతి ఏడాది జరుగుతుందని, దీంతో ఇతర రాష్ట్రాల నుంచి సేట్‌లు ఇక్కడ మకాంపెట్టి దళారీలతో కుమ్మక్కై పంట చేతికి వచ్చినపుడు రేట్లు తగ్గిస్తున్నారని తెలిపారు. కేజీ 16 రూపాయల నుంచి 10 రూపాయలకు తెచ్చారని చెప్పారు. పద్ధతి మార్చుకుంటే రైతులతో కలిసి నిరసనలు చేపడతామని హెచ్చరించారు. దీనిపై కూటమి ప్రభుత్వం అధికారులు చొరవచూపాలని డిమాండ్ చేశారు.

ట్రాక్టర్ సీజ్; కేసు నమోదు

వీరబల్లి : మండలంలోని కొత్తపల్లి వద్ద ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గువ్వలచెరువులో బస్సులను ఆపండి

రామాపురం : గువ్వలచెరువు గ్రామంలో గతంలో నాన్‌స్టాప్ బస్సులు స్టాపింగ్ ఉండేదని, గత కొన్ని సంవత్సరాల నుంచి నాన్‌స్టాప్ బస్సు స్టేజీని తొలగించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి గ్రామ ప్రజలు మంగళవారం తీసుకెళ్లారు. స్టాపింగ్ కల్పించాలని విన్నవించారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం



సమస్యలపై చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

సంబేపల్లె : వైఎస్సార్‌సీపీ అసలైన బలం కార్యకర్తలే అని, వారికి పార్టీ అండగా ఉంటూ కాపాడుకుంటుందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దేవపట్ల గ్రామం ఆవులవాండ్లపల్లెలోని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డిని మంగళవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

సిద్దవటం : సిద్దవటం గాండ్లవీధి సమీపంలో ఉన్న పెన్నానది నుంచి రాత్రివేళల్లో అక్రమ ఇసుక రవాణా జరుగుతుండటంతో మంగళవారం జేసీబీతో నదిలోకి వెళ్లకుండా గోతులు తీసి అడ్డుకట్ట వేశామని ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రివేళల్లో జోరుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతునట్లు తమకు ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఇసుక అక్రమ రవాణా జరగకుండా వాహనాలు పెన్నానదిలోకి వెళ్లకుండా గోతులు తీశామని, ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతన్నకు కష్టకాలం

గత రెండు రోజులుగా అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షానికి విచిత్ర పరిస్థితి నెలకొంది. కిలోమీటర్ పరిధిలోనే ఒక చోట భారీ వర్షం కురిస్తే మరొక చోట చిరుజల్లు కురవడంతో రైతులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. కొన్ని ప్రాంతాలలో చెక్‌డ్యాంలలో నీరు నిల్వగా వంకలలో నీరు పారాయి. పంటలు సాగు చేసిన రైతులకు కొందరికి మోదం.. కొందరికి ఖేదం.. అన్న చందంగా పరిస్థితి నెలకొంది. ఏది ఏమైనా రుతుపవనాలు విస్తరించినప్పటికి భారీ వర్షాలు లేక రైతాంగం సాగు కష్టాలు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు గ్రామాలలో తాగు నీటి ఎద్దడిని ప్రజలు ఎదుర్కొంటున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



సంబేపల్లె: దుద్యాల గ్రామంలో చెక్‌డ్యాం అలుగుపై పారుతున్న వర్షపు నీరు (అక్కడ)



సంబేపల్లె : మండల కేంద్రం సమీపంలో వర్షం పడకపోవడంతో చుక్క నీరు లేని చెక్‌డ్యాం (ఇక్కడ)



గాలివీడు: గోరాన్‌చెరువులో కంది పంటకు ట్యాంకర్ ద్వారా తడిని అందిస్తున్న రైతులు



లక్కిరెడ్డిపల్లె: మద్దిరేవుల గ్రామం అప్పలరాజుగారిపల్లి సమీపంలో వేరుశనగ పంట దుస్థితి



వీరబల్లె: తాటిగుంటపల్లెలో ఎండిపోయిన వరి పంట



చిన్నమండెం: దేవగుడిపల్లెలో ఎండిపోయిన వేరుశనగ పంట



వీరబల్లె: వంగిమళ్లలో అహమ్మద్ బాషాకు చెందిన పొలంలో ఎండిపోయిన బావి

తండ్రి ఆశయాలను కొనసాగించడం స్ఫూర్తిదాయకం



కంటి ఆపరేషన్ల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట టౌన్ : దివంగత మాజీ సమితి అధ్యక్షులు పోలా వెంకటరెడ్డి సేవాతత్పరత ఉన్న వ్యక్తి అని ఆయన బాటలోనే మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, పోలా వెంకటరమణారెడ్డిలు సేవలు కొనసాగిస్తూ తండ్రి ఆశయాలు కొనసాగిస్తుండటం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. స్థానిక కాకతీయ విద్యా సంస్థల ఆవరణలో పోలా వెంకటరెడ్డి శతయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటివైద్య శిబిరంలో మంగళవారం కంటి ఆపరేషన్ల కార్యక్రమాన్ని ఆకేపాటి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాజంపేట పట్టణాభివృద్ధికి తొలుత బీజం వేసిన ఘనత పోలా వెంకటరెడ్డికే దక్కుతుందన్నారు. పట్టణానికి, పేద ప్రజలకు ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. నిత్యం వందలాది మంది రోగులు వైద్య శిబిరానికి వస్తున్నా పోలా సోదరులు రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తుండటం గొప్ప విషయమన్నారు. మరో నాలుగు రోజుల పాటు ఈ ఉచిత మెగాకంటి వైద్య శిబిరం కొనసాగుతుందని, కంటి సమస్యలు ఉన్న పేద, మధ్య తరగతి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యూత్ విభాగం నాయకులు పోలా వాసవిరాజ్‌ధీరజ్‌రెడ్డి, పోలా సాయివైభవ్‌రెడ్డి, వివిధ విభాగాల కన్వీనర్లు పాపినేని విశ్వనాథరెడ్డి, రెడ్డిమాసి రమేష్‌నాయుడు, దాసరి పెంచలయ్య, దండు గోపి తదితరులు పాల్గొన్నారు. కాగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటి వరకు 571 మందికి పరీక్షలు జరుపగా 219 మందికి ఆపరేషన్లు అవసరమైనట్టు వైద్యులు గుర్తించారు. వీరిలో 103 మందికి కంటి జబ్బు సమస్య తీవ్రతరంగా ఉండటంతో చెన్నైలో ఉచితంగా భోజనం, వసతి సౌకర్యాలు కల్పించి ఆపరేషన్లు చేయించనున్నారు. మరో 116 మందికి వైద్య శిబిరంలోనే మొబైల్ ఆపరేషన్ థియేటర్‌లో ఆపరేషన్లు జరుపనున్నారు. ఇప్పటి వరకు 26 మందికి ఆపరేషన్లు చేసినట్లు కాకతీయ విద్యా సంస్థల అధినేత పోలా వెంకటరమణారెడ్డి తెలిపారు.

ప్రతి దివ్యాంగుడికి కృత్రిమ అవయవాలు



చిట్వేలి: క్యాంపునకు హాజరైన దివ్యాంగులు

రైల్వేకోడూరు అర్బన్ : కృత్రిమ అవయవాలు అవసరమున్న ప్రతి దివ్యాంగుడికి పరికరాలు అందజేస్తామని సహాయ సంచాలకులు ఆర్‌వీ కృష్ణకిషోర్, విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షులు నెల్లూరు ధనంజయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలోని హెచ్‌ఎంఎం హైస్కూల్ కృత్రిమ అవయవ పరికరాలు అవసరమున్న విభిన్న ప్రతిభావంతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 250 మంది అర్హులను గుర్తించినట్లు వారు చెప్పారు.ఈ కార్యక్రమంలో వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ అసెస్‌మెంట్ శిబిరానికి స్పందన

చిట్వేలి : దివ్యాంగుల ఉపకరణాల అందజేసే నిమిత్తం నిర్వహించిన మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపునకు 180 మంది దివ్యాంగులు హాజరై తమ సర్టిఫికెట్లు సమర్పించి పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ అధికారులు కోదండ నాయుడు, ఈశ్వరయ్య, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తంరెడ్డి, జిల్లా డిజేబుల్డ్ సూపరింటెండెంట్ హుస్సేన్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

'సుగవాసీ.. నియంత ధోరణి మానుకో'



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సిద్దవటం : రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన సుగవాసి బాలసుబ్రమణ్యం తన నియంత ధోరణి మానుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు శనివారపు మోహన్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కారదర్శి కాడే శ్రీనివాసులనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథ రామనాయుడు తెలియజేశారు. సిద్దవటంలో మంగళవారం వారు పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో సుగవాసిని పార్టీ అభ్యర్థిగా ప్రకటిస్తే ఆయన విజయానికి సమష్టిగా కృషి చేశామని, కానీ ఓటమి చెందడం బాధాకరమన్నారు. పార్టీ కష్టపడి పని చేస్తున్న కార్యకర్తలను సుగవాసి పక్కన పెట్టడం అన్యాయమన్నారు. ఏ నాయకులు ఆయన దగ్గరికి వెళ్లినా మీరు ఎన్నికల్లో నాకు సహకరించలేదని మీరు నావద్దకు రావద్దంటూ హెచ్చరించడం తగదన్నారు. కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించడం సమంజసం కాదన్నారు. వర్గ విభేదాలను పెంచి పోషించకుండా అందరిని కలుపుకుని వెళ్లాలంటూ హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి, జవహర్‌బాషా, రాజేంద్రప్రసాద్ యాదవ్, డాక్టర్ వీరభద్రుడు, బాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, సుబ్బారెడ్డి, ప్రతాప్‌నాయుడు, నాగం నరసింహారెడిలు పాల్గొన్నారు.

రైతుల ఆదాయాన్ని పెంచేందుకే 'పొలం పిలుస్తోంది'



రాజంపేట రూరల్: ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిద్దవటం : క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతుకు ఆదాయం పెంచేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయాధికారి కె. రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దపల్లి, శివునిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిగారి పల్లె, మోటకట్ల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం మండల ఏఓ కిషోర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను వివరించడంతో పాటు వేరుశనగ పంటను పరిశీలించి, నీటి ఎద్దడిని తట్టుకొనుటకు 20 గ్రాములు యూరియాను 1 లీటరు నీరు పిచికారీ చేయాలని కోరారు.

రాజంపేట రూరల్ : రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు సాగు చేసేందుకు ముందుకు రావాలని వ్యవసాయశాఖ ఏఓ జి.రాజకుమారి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని తాళ్లపాక పంచాయతీలో ఉదయం, ఎంజీ పురం పంచాయతీలో మధ్యాహ్నం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెనగలూరు : మండలంలోని నారాయణ నెల్లూరు రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వ్యవసాయ, ఉద్యానవన శాఖ, పశు సంవర్ధకశాఖ అధికారులు కలిసి పొలం పిలుస్తుంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులు గురించి వివరించారు. అలాగే ప్రభుత్వ పథకాలు, రైతులకు కావాల్సిన మెటీరియల్స్‌పై వారు వివరించారు. అనంతరం వరి పొలాన్ని సందర్శించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతా చక్రపాణి, రైతు సేవా సిబ్బంది గాయత్రి, వంశీ, సెక్రటరీ గౌరీ, పశువైద్యశాఖ అసిస్టెంట్ హరి, సర్వేయర్ సౌభాగ్య, రైతులు పాలొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు రైతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పుల్లంపేట వ్యవసాయ అధికారి శేఖర్ అన్నారు. మంగళవారం బావికాడపల్లి, తిరుమలయ్యగారిపల్లె గ్రామాలలో అధికారులతో కలిసి పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా అరటి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పసుపు, మామిడి, జామ, నిమ్మ తదితర పంటల సాగులను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో పశువర్ధకశాఖ అధికారి ఇక్బాల్, ఉద్యాన సహాయకులు ప్రవీణ్, ఉదయ్ భాను, దిలీప్, ప్రకృతి వ్యవసాయ సిఆర్‌పీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సినీనటుడు ప్రదీప్‌కు సన్మానం

రాజంపేట : సినీనటుడు కేవీ ప్రదీప్‌ను అన్నమాచార్య యూనవర్సిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి, ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డిలు ఘనంగా సన్మానించారు. మంగళవారం ఏయూ ఆడిటోరియంలో వ్యక్తిత్వ వికాస కార్యక్రమం ముగింపు సభలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.ఎస్ఎంవీ నారాయణ, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డా.ఎం.సుబ్బారావు, బాలనాగేంద్రప్రసాద్, డీన్స్, హెచ్ఓడీలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి

గాలివీడు : ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపల్ జయచంద్రా రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పీసీఎస్ఎస్ - టీఐ ఎన్జీఓ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు 'మీకు తెలుసా' కార్యక్రమం ద్వారా హెచ్ఐవీపై విద్యార్థులలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీసీఎస్ఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ టి.స్వాతి, సిబ్బంది, జువాలజీ లెక్చరర్ కిరణ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు

రాజంపేట రూరల్ : హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు వైరల్ లోడ్, సీడీ4 పరీక్షలు నిర్వహించినట్లు ఎండీ పైథాలజీ వైద్యులు శుభశ్రీ తెలియజేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలోని లింక్ ఏఆర్‌టీ సెంటర్(ఎల్ఏసీ)లో మంగళవారం 84 వైరల్ లోడ్ నమూనాలను, 44 సీడీ4 నమూనాలను వ్యాధిగ్రస్తుల నుంచి సేకరించి కడప ఎల్ఏసీ ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ అనుష్క, ప్రాజెక్టు ఆఫీసర్ మంజుల, పి.వెంకటసుబ్బయ్య, చైతన్య, శివయ్య, ఆర్.కాంచన, అర్చన తదితరులు పాల్గొన్నారు.

సేవా భావాన్ని అలవరుచుకోండి

నందలూరు : విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సేవా భావాన్ని అలవరుచుకోవడమే ఎన్ఎస్ఎస్ ఉద్దేశమని రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ అన్నారు. ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సేవా భావాలు పెంచుకోవాలని తెలియజేశారు.

కొత్త తహసీల్దార్‌కు సమస్యల స్వాగతం

- 4 నెలల తరువాత మండలానికి తహసీల్దార్ నియామకం
- సవాలుగా మారనున్న కూటమి నేతల భూ ఆక్రమణలు
- తీరని రెవెన్యూ సమస్యలతో కోడూరు ప్రజల వెతలు



కోడూరు తహసీల్దార్ కార్యాలయం

రైల్వేకోడూరు అర్బన్ : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలోని తహసీల్దార్ కుర్చీకి ఎట్టకేలకు మోక్షం లభించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినప్పటికీ ఇక్కడ తహసీల్దార్‌ను నియమించలేదు. సోమవారం పలు మండలాల తహసీల్దార్‌లను బదిలీ చేస్తూ జిల్లా అధికార యంత్రాంగం ఉత్తర్వులు ఇచ్చింది. ఇందులో భాగంగా రాజంపేట తహసీల్దార్ ఎస్. మహబూబ్ చాంద్‌ను రైల్వేకోడూరు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. నాలుగు నెలల తరువాత మండలానికి తహసీల్దార్ నియమించడంతో ఆయనకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కొందరు సమయం లేదు మిత్రమా అంటూ ఎక్కడ పడితే అక్కడ దళిత, గిరిజన, దేవదాయ శాఖ, ప్రభుత్వ, వంక పరంబోకు, ఆర్అండ్‌బీ తదితర భూములను ఆక్రమించుకోవడమే కాక రికార్డుల తారుమారుకు యత్నించారు.

సమస్యల పరిష్కార వేదిక సమాధానలిచ్చేనా..?

ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక స్పందనను కాస్త గ్రీవెన్స్ సెల్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)ను తీసుకొచ్చారు. ప్రతి సోమవారం కోడూరు తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో భూ సమస్యలు, పాసు పుస్తకాలు, ఆక్రమణలు తదితర సమస్యలపై ప్రజలు వందలాది అర్జీలు పరిష్కరించక పెండింగ్‌లో ఉంచారు. ఇప్పటికైనా తమ సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుందనే ఆశాభావం వారు వ్యక్తంచేస్తున్నారు.

ఇక్కడి పోస్టింగ్‌కు డిమాండ్!

రైల్వేకోడూరు మండలానికి తహసీల్దార్ పోస్టింగ్‌కు డిమాండ్ ఎక్కువ. ఏ పార్టీ అధికారంలో ఉంటే వారికి అనుకూలంగా వ్యవహరించే వారికే ఇక్కడ పోస్టింగ్‌లు లభిస్తూ వస్తోంది. ఈ కారణంగానే అధికార పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకులు తాము చెప్పినట్టు చేసేవారికి పోస్టింగ్ ఇప్పించేందుకే నియామకం ఆలస్యమైందని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం వస్తున్న తహసీల్దార్ కూటమి నాయకుల ఒత్తిళ్లకు తల్లొగ్గుతారో.. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

శ్మశాన స్థలంలో ఇళ్లు నిర్మించినవారికి పట్టాలిస్తాం

పెనగలూరు : మండల కేంద్రానికి చెందిన శ్మశాన స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న వారి స్థలాలను గ్రామ కంఠంలో కలిపి పట్టాలు అందజేస్తామని పంచాయతీ ఉప సర్పంచ్ చిన్న వెంగల్ రెడ్డి, సెక్రటరీ సుబ్బరాయుడులు తెలిపారు. మంగళవారం సచివాలయ ప్రాంగణంలో శ్మశానంలో ఇళ్లు కట్టుకున్న వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మాట్లాడుతూ సర్వే నెంబరు. 94లో 10.26 ఎకరాలు భూమి ఉండేదన్నారు. ఆ పది ఎకరాల స్థలంలో దాదాపు వందకు పైగా ఇళ్లను నిర్మించుకొని కాపురం చేస్తున్నారన్నారు. అయితే ఇటీవల పెనగలూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సర్వే నెంబరు. 94పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. కలెక్టర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అక్కడ ఇళ్లు నిర్మించుకున్న వారందరికీ నోటీసులు ఇచ్చి ఇక్కడికి పిలిపించామన్నారు. పంచాయతీ తరపున తీర్మానం పాస్ చేసి సర్వే నెంబరు. 94ను గ్రామకంఠంగా మార్చాలని కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. శ్మశానంలో ఇళ్లు నిర్మించుకున్న వారు రెండు, మూడు రోజులలో దరఖాస్తు ఫారాలను ఇవ్వాలని వారు తెలిపారు. ముఖ్యంగా 94 సర్వేలో జగనన్న కాలనీ లే అవుట్ కూడా వేశారని వారు దరఖాస్తు చేసుకోకూడదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

రైల్వేకోడూరు అర్బన్ : వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని మంగళవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. మండలంలోని ఓబనపల్లి పంచాయతీలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. రైతలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు వివరించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే అనంతరాజుపేట పంచాయతీలో జరిగిన ప్రజావేదికలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

రూ. 27.48 కోట్లతో చిట్వేలి – కోడూరు రోడ్డు మార్గం

చిట్వేలి : చిట్వేలి – రైల్వేకోడూరు మధ్య 15 కిలోమీటర్లు డబుల్ తారురోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అరవశ్రీ ధర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి మంగళవారం శ్రీరామపురం వద్ద భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజులలో ప్రతి మారుమూల గ్రామానికి తారురోడ్డు, సిమెంట్ రోడ్డు నిర్మిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయివికాస్‌రెడ్డి, కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని మద్దిరేవుల సెక్టార్ పరధిలోని రెడ్డివారిపల్లి అంగన్‌వాడీ స్కూల్‌లో పౌష్టికాహార మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం తినడం వల్ల వచ్చే లాభాలను తెలియజేశారు.

ఆలయ అభివృద్ధికి చర్యలు

గాలివీడు : మండలంలోని అరవీడు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని దేవదాయశాఖ అధికారి విశ్వనాథ తెలిపారు. ఆయన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో మంగళవారం ఆలయాన్ని పునఃపరిశీలించి రాబోయే రోజుల్లో ఆలయ రూపురేఖలు మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

రాయచోటి (జగదాంబసెంటర్) : సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని త్జాలి బజావో కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద 25న బుధవారం (నేడు) నిరసన వ్యక్తం చేస్తున్నట్లు డీసీసీ అధ్యక్షులు గాజుల భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కొనసాగుతున్న స్వచ్ఛతా హీ సేవా

ఒంటిమిట్ట(సిద్దవటం): మండల పరిధిలోని కొండమాచుపల్లె, కొత్తమాధవరం, నరవకాటిపల్లె గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాలలో మంగళవారం సర్పంచ్‌ల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల ప్రత్యేకాధికారిణి శాంతమ్మ మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమాలను గ్రామ సభల రూపంలో నిర్వహించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం అనుసరించాలి

చిన్నమండెం : వెలుగు కార్యాలయంలో చిన్నమండెం మహిళా మండల సమాఖ్య సభ్యులకు మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ అధికారులు చంద్రశేఖర్, సురేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయం అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల టీమ్ లీడ్ చందురెడ్డి, వెలుగు ఏపీఎం రెడ్డమ్మ, మండల పాయింట్ పర్సన్స్ సుబ్రమణ్యం ఆచారి, మాస్టర్ ట్రైనర్లు, సీసీలు, మండల మహిళా సంఘ కార్యనిర్వాహక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించండి

లక్కిరెడ్డిపల్లె : మండల వ్యాప్తంగా తీవ్రమైన కరువు ఛాయలు అలుముకున్నాయని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో చౌటపల్లి గ్రామ పరిధిలోని వెంకటసుబ్బయ్య పొలంలో వేరుశనగ పంటను పరిశీలించారు. ఇప్పటికే దాదాపు 1926 ఎకరాలలో వేరుశనగ పూర్తిగా ఎండిపోయిందన్నారు. లక్కిరెడ్డిపల్లెను కరువు మండలంగా ప్రకటించి రైతులకు పంట నష్టాన్ని అందించాలని డిమాండ్ చేశారు.